రిపల్స్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలి

విద్యార్థి సంఘాల వినతి

బిచ్కుంద, బతుకమ్మ :బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రిపల్స్ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు గురువారం బిచ్కుంద మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా బిచ్కుంద పట్టణంలో రిపల్స్ విద్యాసంస్థ కొనసాగుతోందని తెలిపారు. మొదట్లో ఈ సంస్థ బిచ్కుంద పట్టణంలో అద్దె భవనంలో నిర్వహించబడిందని, అనంతరం కందర్పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వ్యవసాయ భూమిలో నిర్మాణాలు చేపట్టి విద్యాసంస్థను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాసంస్థ నిర్వహిస్తున్న స్థలానికి డిటిసిపి అనుమతి, లే ఔట్ పర్మిషన్, ఇతర సంబంధిత అనుమతులు లేకుండానే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని విద్యార్థి సంఘాలు పేర్కొన్నాయి. భవిష్యత్‌లో సంస్థకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థ యాజమాన్యంతో మాట్లాడి స్థలాన్ని చట్టబద్ధం చేయాలని, లేదంటే సంస్థ నిర్వహణను నిలిపివేయాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్. బాలరాజ్, టిఎస్ పీ జిల్లా అధ్యక్షులు మావురం శ్రీకాంత్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మెక్కా సాయి తదితరులు పాల్గొన్నారు.ం

అపరిచిత వ్యక్తులకు వివరాలు వెల్లడించవద్దు

ఎస్సై దీపక్ కుమార్

లింగంపేట్, బతుకమ్మ :గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంకుల వివరాలు ఓటీపీ వివరాలు వెల్లడించవద్దని లింగంపేట ఎస్సై దీపక్ కుమార్ సూచించారు. గురువారం లింగంపేట మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై దీపక్ కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలతో మోసపోతే టోల్ 1930 కాల్ చేయాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంక్ అధికారుల పేరిట పోలీసుల పేరిట ఓటీపీలు అడిగితే వివరాలు వెల్లడించవద్దన్నారు. బ్యాంకు ఆఫీసర్లు గాని పోలీస్ ఆఫీసర్లు గాని ఓటీపీలు చెప్పమని అడగరు అన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100/112 కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ కళా బృందం ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్ రామంచ తిరుపతి శేఖరావు పిసిలు ప్రభాకర్ సాయిలు మాటలు పాటలు ద్వారా బ్యాంకులో ఖాతాదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ష్ టీమ్ సభ్యులు శ్రీశైలం, సుప్రజ, బ్యాంక్ మేనేజర్ డి.జ్యోతి బ్యాంక్ సిబ్బందితో పాటు బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు .

బీడీఎస్ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా ఆనంద్

నిజామాబాద్ సిటీ, బతుకమ్మ :బహుజన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీడీఎస్ఎఫ్) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్‌గా బైసా మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆనంద్‌ను నియమించినట్లు బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు తల్లారి సంజయ్ ప్రకటించారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో గల బీడీఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆనంద్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తల్లారి సంజయ్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బహుజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆనంద్ కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల హక్కుల సాధన, విద్యా రంగ సమస్యలపై పోరాటం, విద్యార్థి ఉద్యమ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆనంద్ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జిల్లాలో బహుజన విద్యార్థుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

యూరియా యాప్ రద్దు చేసి అవసరమున్నంత యూరియా అందుబాటులో ఉంచాలి



వేల్పూర్, బతుకమ్మ :రైతులను ఇబ్బంది పెడుతున్న యూరియా యాప్ ను పూర్తిగా రద్దు చేసి, రైతులకు ఎకరానికి నాలుగు సంచుల యూరియాను ఎలాంటి ఆంక్షలు లేకుండా ఒకేసారి పంపిణీ చేయాలని, సొసైటీల్లో, షాపుల్లో సరిపడా యూరియా విరివిగా ఉంచాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఇబ్బంది కరంగా మారిన యూరియా యాప్ ఎత్తివేసి రైతులకు సరిపడా యూరియాను సొసైటీలు, ఫర్టిలైజర్ షాపుల్లో అందుబాటులో ఉంచాలని, వేలు రైతు సమస్యలను తీర్చాలన్న డిమాండ్ తో గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో మండలంలోని లక్ష్మీరా చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ మేరకు మూడు గంటల పాటు బీఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఎర్రని ఎండలో ప్రశాంత్ రెడ్డి జాతీయ రహదారిపై బైటయించి జై జవాన్ జై కిసాన్, రైతుల ఐక్యత వర్ధిల్లాలి, యూరియా యాప్ ను ఎత్తి వేయాలి, సీ ఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న నేడు కడుపు మంటతో, ఆవేదనతో రోడ్లపైకి వచ్చి పోరాడాల్సిన దుస్థితిని ఈ రాక్షస ప్రభుత్వం, దుర్మార్గపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని ధ్వజమెత్తారు. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం, రైతు ఏడ్చిన రాజ్యం" ఎన్నటికీ ముందడుగు వేయలేదని, రైతులు లేకపోతే రాజ్యమే లేదని మన పెద్దలు చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రైతులు ప్రతి చిన్న అవసరానికి, హక్కుల కోసం రోడ్లెక్కి కొట్లాడాల్సి వస్తోందని, అలాంటి దారుణమైన పరిస్థితి నేడు రాష్ట్రంలో దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ రైతులను కంటికి రెప్పలా, గుండెల్లో పెట్టుకుని కాపాడుకున్నారన్నారు.

దశాబ్దాలుగా తెలంగాణ రైతాంగం ఎదుర్కొంటున్న కరెంట్ కష్టాలను దూరం చేస్తూ 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు.కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, వరద కాల్వల ద్వారా గోదావరి జలాలను పోచంపాడుకు తరలించి, అక్కడి నుండి కప్పలవాగు, పెద్దవాగులను నింపిన విధానాన్ని గుర్తుచేశారు.నియోజకవర్గ వ్యాప్తంగా చెక్ డ్యామ్‌లను నిర్మించి, భూగర్భ జలాలను పెంచి రైతాంగానికి సాగునీటి ధోకా లేకుండా చేశామని వివరించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా పంపిణీలో డిజిటల్ యాప్‌ల పేరుతో కొత్త నిబంధనలు తీసుకువచ్చి రైతులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోందని ఎమ్మెల్యే ఆరోపించారు.కొత్తగా ప్రవేశపెట్టిన యాప్ విధానం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అవసరమైన యూరియాను ఎకరానికి 4 సంచుల చొప్పున ఒకేసారి సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ తుగ్లక్ పాలన వల్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో రైతులు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

అంకాపూర్ గ్రామంలో ప్రారంభమైన ఈ నిరసన జ్వాలలు మోర్తాడ్, తిమ్మాపూర్, ధర్మోరా, వేల్పూర్,డొంకేశ్వర్, మెండోరా, కమ్మర్‌పల్లి, బడా ఫీమ్‌గల్ వంటి అనేక గ్రామాలకు విస్తరించాయని, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనూ, రైతులు స్వతంత్రంగానూ రాస్తారోకోలు చేస్తూ తమ నిరసనను తెలియజేస్తున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖాధికారులు ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నాయని చేస్తున్న ప్రకటనలలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అధికారులు చెప్తున్న లెక్కల ప్రకారం జిల్లాలో మొత్తం 3 లక్షల మంది రైతులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 1.5 లక్షల మందికి మాత్రమే 4 లక్షల యూరియా సంచులను పంపిణీ చేశారని, అంటే ఒక్కో రైతుకు రెండు సంచులు కూడా సరిగా అందలేదని ఎద్దేవా చేశారు. మిగిలిన 1.5 లక్షల మంది రైతులకు ఇప్పటివరకు ఒక్క సంచి కూడా అందలేదని ఆరోపించారు.

జిల్లాలో దాదాపు 6 లక్షల ఎకరాల సాగు భూమి ఉందని, ఎకరానికి కనీసం 4 సంచుల చొప్పున లెక్కించినా ఒకే పంట కాలానికి 24 లక్షల సంచుల యూరియా అవసరమవుతుందని గుర్తుచేశారు. ఇప్పటివరకు 4 లక్షల సంచులు మాత్రమే ఇచ్చి, ఇంకా 20 లక్షల సంచుల కొరత ఉండగా స్టాక్ ఫుల్ ఉందని ప్రకటించడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సొసైటీలు డిఫాల్ట్ అయ్యాయంటూ కాంగ్రెస్ నేతలు సాకులు వెతుకుతూ తప్పుదు ప్రచారం చేస్తున్నారని వేముల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వ వేధింపుల చర్యల్లో భాగంగా ఇప్పటికే సొసైటీ చైర్మన్లపై మూడు సార్లు ప్రత్యేక ఆడిట్ నిర్వహించినప్పటికీ ఎలాంటి అవకతవకలు తేలలేదని, 2014కు పూర్వపు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆ బకాయిలు ఉన్నట్లు ఆడిట్‌లో స్పష్టమైందని గుర్తు చేశారు. ఒకవేళ సొసైటీలపై ఏవైనా చర్యలు తీసుకోవాలనుకుంటే తీసుకోవచ్చని, దానిని సాకుగా చూపి రైతులకు ఎరువులు నిలిపివేయడం దుర్మార్గమన్నారు. డీఫాల్ట్ కానీ సొసైటీ ల్లో, ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులలో కూడా ఎందుకు యూరియా దొరకడం లేదని అయన ప్రశ్నించారు. చేతకానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, బాల్కొండ రైతాంగం అంత అమాయకులు కారని హితవు పలికారు గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎరువుల కొరత రాకుండా అన్‌సీజన్‌లోనే ముందస్తుగా నిల్వలను తెప్పించి సొసైటీలు, దుకాణాలలో సిద్ధంగా ఉంచేవారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం కోటాలు తగ్గించిన సమయంలో, తాము స్వయంగా ఢిల్లీకి వెళ్లి అప్పటి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో చర్చించి, రాష్ట్రంలో పెరిగిన సాగు విస్తీర్ణం, ప్రాజెక్టుల, చెక్‌డ్యామ్‌ల వివరాలను వివరించి ఒప్పించి అదనపు కోటాలు సాధించుకున్నామని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గానీ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి గానీ రైతుల పట్ల ఆ కనీస బాధ్యత లేదని విమర్శించారు. గతంలో రూ. 1200 గా ఉన్న 20:20 (బీస్ బీస్) ఎరువుల బస్తా ధరను నేడు ఏకంగా రూ. 2150 కి, జీలుగు 1450 నుండి ఏకంగా 2450 కి పెంచి బీజేపీ కేంద్ర ప్రభుత్వం రైతుల నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించకపోతే సమాజం ఏం తింటుందని ప్రశ్నించారు. రైతులను రోడ్ల మీద కూర్చోబెట్టడమే ఈ ప్రభుత్వాల సాధన అయితే, రాబోయే రోజుల్లో అన్నదాతలు పాలకులకు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన ఇరు ప్రభుత్వాలను హెచ్చరించారు. కేసీఆర్ పాలనలో రైతు సంక్షేమమే లక్ష్యంగా ఎలాంటి ఆంక్షలు లేకుండా ఎకరానికి రూ.10,000 చొప్పున రైతు బంధు అందించి, రూ.75,000 కోట్లకు పైగా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారని,అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చినా, ఐదు సీజన్లు గడిచినా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. అలాగే రూ.2 లక్షల రుణమాఫీ కూడా పూర్తిగా అమలు కాలేదని, బాల్కొండ నియోజకవర్గంలో అనేక మంది రైతులు ఇంకా లబ్ధి పొందలేదని పేర్కొన్నారు. యూరియా యాప్ ప్రవేశ దరిమిలా గ్రామీణ ప్రాంత రైతులకు స్మార్ట్‌ఫోన్లు, యాప్ వినియోగంపై అవగాహన లేకపోవడంతో యూరియా పొందడం కష్టమవుతోందన్నారు. ఒకేసారి అవసరమైన ఎరువులు ఇవ్వకుండా పరిమితంగా పంపిణీ చేయడం వల్ల రైతులు పలుమార్లు తిరగాల్సి వస్తోందని విమర్శించారు. ధర్నాను సైనిక పోలీసులు బలవంతంగా విరమింప చేయడానికి ప్రయత్నించినా రైతులు విరమించక పోగా, కలెక్టర్ తరపున అడిషనల్ కలెక్టర్ జిల్లా వ్యవసాయాధికారులతో సంఘటన స్థలానికి వచ్చి కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడించి సమస్యల పరిష్కారానికి తనవంతుగా ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా, రాస్తారోకును ప్రశాంత్ రెడ్డి విరమించారు.

ఇకపై పేపర్‌లెస్ విధానంలో తెలంగాణ మంత్రిమండలి సమావేశాలు

హైదరాబాద్, బతుకమ్మ :తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశాలను ఇకపై పేపర్‌లెస్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రిమండలి సమావేశాలను డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ప్రభుత్వం “తెలంగాణ డిజిటల్ కేబినెట్” విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులందరికీ ప్రత్యేక ట్యాబ్‌లను అందజేశారు. సమావేశంలో డిజిటల్ కేబినెట్ విధానం, ట్యాబ్‌ల ద్వారా మంత్రివర్గ సమావే శాల నిర్వహణ ప్రక్రియను ప్రదర్శించి పరిశీలించారు. ఇకపై మంత్రివర్గ సమావేశాలకు సంబంధించిన ఎజెండా, నోట్స్, ఇతర ముఖ్యమైన పత్రాలు అన్నీ ఈ-బుక్ రూపంలోనే మంత్రులకు అందుబాటులో ఉంచనున్నారు. ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచడంతో పాటు, కాగిత వినియోగాన్ని తగ్గించి వేగవంతమైన, పారదర్శకమైన పాలనకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు.